రాష్ట్ర భవిష్యత్తు కోసం మళ్లీ జగనే రావాలి

- పలు చోట్ల 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు
- ఇంటింటికి తిరిగి సంక్షేమ లబ్ధిని వివరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

యడ్లపాడు: జనరంజక పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఘంటా శంకర్ చెప్పారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో సొసైటీ చైర్మన్ బసెల శివరామకృష్ణ ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం బుధవారం జరిగింది. ముందుగా ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు సచివాలయంలో సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. జగనన్న కాలనీలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సభకు శంకర్‌తో పాటు జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, ఎంపీపీ పిడతల ఝాన్సీ, జెడ్పీటీసీ సభ్యులు ముక్తా వాసు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలనే కాకుండా, ఇవ్వని వాటిని కూడా అమలు చేసిన ఘనత జగనన్నదే అన్నారు. నవరత్న సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా.. అవినీతికి ఆస్కారం లేకుండా ప్రతి పథకాన్ని నేరుగా పేదప్రజల ఇంటికే చేర్చారన్నారు. ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిన గొప్ప నాయకుడిగా దేశ చరిత్రలోనే సీఎం జగన్ నిలిచిపోయారన్నారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సహకారంతో సచివాలయం పరిధిలోని సంగంగోపాలపురం, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి రూ.26,26,36,296 కోట్ల లబ్ధి ఆయా గ్రామాల ప్రజలకు చేకూరిందన్నారు. డీబీటీ, నాన్‌డీబీటీ కలిపి మొత్తం 33 సంక్షేమ పథకాల ద్వారా రూ.23,36,06,296 లబ్ధిచేరగా, పలు అభివృద్ధి పనులకు సంబంధించి రూ.2,90,30,000 నిధులు వచ్చాయన్నారు. ఇవిగాక ఉపాధిహామీ పథకం నిధులు రూ.25 లక్షలతో వివిధ పనులకు వెచ్చిస్తున్నట్లు వివరించారు. అనంతరం గ్రామంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట, బుస్సీనగర్, సంగంగోపాలపురం ప్రాంతాల్లో పలు ఇళ్లను సందర్శించి గత నాలుగేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన పాలనాప్రగతి, సంక్షేమ, అభివృద్ధి వివరాల కరపత్రాలు గ్రామస్తులకు పంపిణీ చేశారు. సర్పంచ్ మల్లవరపు పోలవతి, ఎంపీటీసీ సభ్యురాలు వావిళ్ల పోలేరు, నాయకులు చాతరాజుపల్లి శ్రీనివాసరావు, కోట పెదబాబు, విప్పర్ల కోటయ్య, కాళహస్తి రాంబాబు, పోట్లూరి సైదులు బసెల కృష్ణమూర్తి, బయ్యా శ్రీనివాసరావు, ఎంపీ బాలచంద్రారెడ్డి, ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, రావూరి వేణుగోపాలరావు, గుత్తి సింగయ్య, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ రజిని, వలంటీర్లు, సచివాలయ సారథులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొచ్చర్లలో...

ఈపూరు: మండలంలోని కొచ్చర్ల గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. తొలుత సంక్షేమ పథకాల వివరాలు తెలియజేసే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు దిగ్విజయంగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. 98 శాతం హామీలు నెరవేర్చారని, మళ్లీ ఆయనే ముఖ్యమంత్రిగా రావాలని అన్నారు. రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని అన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, గ్రామసర్పంచ్ కోపెల దేవరాజ్, జడ్పీటీసీ చౌడయ్య, శాకమూరి బుచ్చయ్య, బొల్లా బుజ్జి, గోలి వెంకటేశ్వరరావు, జాగర్లమూడి సుబ్బారావు, ఎంపీడీఓ రంగనాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


చెంఘీజ్‌ఖాన్‌పేట సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ బోర్డు ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా పాలన ..

చిలకలూరిపేట: అన్నివర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పట్టణంలోని 25వ వార్డుతో పాటు మండలంలోని రాజాపేట, గోపాళంవారిపాలెం సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించారు. ఆయా సచివాలయాల వద్ద అభివృద్ధి, సంక్షేమ బోర్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత పెద్దఎత్తున సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసిన ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదని వెల్లడించారు. ఈ పథకాలు తిరిగి కొనసాగాలంటే రాష్ట్రానికి జగనే సీఎంగా ఉండాలని పేర్కొన్నారు. పట్టణంలోని 25వ వార్డు సచివాలయ పరిధిలో రూ.16.19 కోట్లు, రాజాపేట సచివాలయ పరిధిలో రూ. 18.37 కోట్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి చేకూరిందని వివరించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వార్డు కౌన్సిలర్ తోట నాగలక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు క్లస్టర్-1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్ -2 విడదల కమలేంద్ర, జేసీఎస్ కన్వీనర్ తోట బ్రహ్మస్వాములు, ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, రాజాపేట, గోపాళంవారిపాలెం సర్పంచులు పఠాన్ మస్తాన్‌వలి, జడ జతిన్‌దేవ్, పార్టీ మండల అధ్యక్షుడు గుత్తా యాములయ్య, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.


రాజాపేట సచివాలయం వద్ద బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు...

వినుకొండ(నూజెండ్ల): వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నూజెండ్ల మండలం ఐనవోలు సచివాలయంలో బుధవారం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ అభివృద్ధి గురించి వివరించే వివరాల బోర్డును, బ్రోచర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మళ్లీ గెలిపించుకోవాలని అన్నారు. ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావు, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, కంచర్ల బాబు పాల్గొన్నారు.

వరికపూడిశెల నిర్మాణమే సీఎం ధ్యేయం..

బొల్లాపల్లి: ఇచ్చిన మాటకు కట్టుబడి వరికపూడిశెల ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారని, జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ డి.గోవిందునాయక్ అన్నారు. మండలంలోని రేమిడిచర్ల సచివాలయం వద్ద బుధవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలు తెలిపే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అటవీశాఖ అనుమతులతో బొల్లాపల్లి మండలానికి తాగు, సాగునీరు అందించే ఎత్తిపోతల పథకం నిర్మాణపనులకు శంకుస్థాపన చేసి మాటకు కట్టుబడ్డారని అన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసి నిష్పక్షపాతంగా గడపగడపకు ప్రతి ఒక్కరికీ సంక్షేమం దరిచేరిందని తెలిపారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే పుస్తకావిష్కరణ చేసి వలంటీర్లకు అందజేశారు. సచివాలయం పరిధిలోని గడప గడపకు వలంటీర్లతో పాటు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి జగన్ ఎందుకు కావాలంటే పుస్తకాన్ని అందజేసి సంక్షేమ పథకాల గురించి వివరించారు. వి.బ్రహ్మనాయక్, బత్తి గురవయ్య, ఆర్.కృష్ణానాయక్, ఎం.రాజయ్య, పి.అవినాష్‌రెడ్డి, ఎస్.మన్నెయ్య, బి.కాంతానాయక్, ఎ.గంగిరెడ్డి, కె.నారాయణరెడ్డి, బి.అంజిరెడ్డి, బి.నాగరాజు, బి.గోవిందయ్య, అధికారులు జి.శ్రీహరి, ఎస్.ఏడుకొండలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


రేమిడిచర్లలో వై ఏపీ నీడ్స్ జగన్ బుక్‌లెట్ ఆవిష్కరణలో వైఎస్సార్ సీపీ శ్రేణులు


కొచ్చర్ల సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా



నాదెండ్ల: గణపవరం జక్కావారి వీధిలో నివాసం ఉండే జక్కా విజయ్‌కుమార్ (32) అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న 1వ సచివాలయం సిబ్బంది మృతుడి కుటుంబానికి వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. మట్టి ఖర్చుల నిమిత్తం మృతుని భార్య మౌనికకు రూ.10 వేలు అందించారు. 1వ సచివాలయం పరిధిలో విజయ్‌కుమార్ పేరు వైఎస్సార్ బీమా పథకంలో నమోదవటంతో రూ. 10 వేలతో పాటూ మరో కొద్దిరోజుల్లో భార్య మౌనిక ఖాతాకు రూ.90 వేలు జమ చేస్తామన్నారు. నగదు అందించిన వారిలో 1వ వార్డు కౌన్సిలర్ తులం సుధాకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ దయానిధి, వలంటీర్ నాగరాజు ఉన్నారు.

ఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదుసాయం...

ఏపీఐఐసీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నాయకుడు రాజేష్‌నాయుడు గణపవరంలోని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. తన ఎంఆర్ ఫౌండేషన్ తరపున రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

నాదెండ్ల: గణపవరం రక్షిత మంచినీటి చెరువులో తాగునీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, జనవరి నుంచి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గణపవరం 1వ సచివాలయంలో పంచాయతీ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అక్టోబర్‌లో ఎన్ఎస్పీ కాలువల ద్వారా చెరువులకు సాగునీటి జలాలు విడుదల చేసినా చెరువుకు నీరు అందలేదన్నారు. దీంతో తాగునీటి నిల్వలు సరిపడా లేక, జనవరి నుంచి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా బోర్లు, బావుల నుంచి పైపులైనుకు అనుసంధానం చేయాలని సూచించారు. దీనికి కావలసిన మోటార్లు, విద్యుత్ కనెక్షన్లు, పైపులైన్లకు సంబంధించిన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి అర్వపల్లి శేఖర్‌ను ఆదేశించారు. ప్రస్తుతం చెరువుల్లో ఉన్న నీటి నిల్వలు డిశంబర్ మాసానికే సరిపోతాయని చెప్పారు.

మిరపలో తెగుళ్లపై అప్రమత్తత అవసరం

నరసరావుపేట రూరల్: మిరపలో బొబ్బర, వేరుకుళ్లు తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పాలపాడు, రావిపాడు ఆర్‌బీకేల పరిధిలోని మిరప పంటలను ఉద్యాన శాఖ అధికారులు బుధవారం క్షేత్ర పరిశీలన చేశారు. మిరపలో వేరుకుళ్లు, బొబ్బర తెగులు ఉన్నట్లు గమనించారు. వేరుకుళ్లు తెగులు నివారణకు 200లీటర్ల నీళ్లకు రిడోమిల్ 400 గ్రాములు ఒక డ్రమ్ములో కలిపి తెగులు ఉన్న మొక్కల మొదలు భాగం పూర్తిగా తడిచేవిధంగా పోయాలని, ఇతర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ ఎం.బోస్, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

యడ్లపాడు: ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...యడ్లపాడు మండలం జగ్గాపురం గ్రామానికి చెందిన ఈశ్వరి(32) కడుపునొప్పి తాళలేక ఈనెల తొమ్మిదో తేదీన ఇంట్లో గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను కొండ్రుపాడులోని కాటూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈశ్వరి తల్లి అప్పమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు

బాల్‌బ్యాడ్మింటిన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



శావల్యాపురం: రాష్ట్రస్థాయి సీనియర్ విభాగంలో బాల్‌బ్యాడ్మింటిన్ క్రీడాపోటీల్లో ఏడుగురు బాలికలు ఎంపికైనట్లు శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బోడ్డపాటి విజయలక్ష్మి బుధవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 19న గుంటూరు ఎన్‌జీహోం నందు నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు సమీరా, కావ్య, వేముల దివ్య, ఉప్పు బసవరాణి, లూథియా, ఓర్సు స్రవంతి, బి.దేవమణిలు ఆడి, ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటిన్ క్రీడా పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. పాఠశాల పీడీ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు డిసెంబరు 8వ తేదీ నుంచి 10 వరకు అనంతపురం జిల్లాలో జరిగే సీనియర్ మహిళల బాల్‌బ్యాడ్మింటిన్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు భువనేశ్వరి, బెజవాడ నాగేశ్వరరావు, రవి, శ్రీకాంత్, హనుమారెడ్డి, శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

కులగణనకు అందరూ సహకరించాలి

నాదెండ్ల: ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న కులగణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్ చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహకారంతో జరుగుతున్నందున ప్రతిఒక్క కుటుంబ సభ్యులు సామాజిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితులపై పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. ఈ వివరాలు వెల్ఫేర్ పథకాలకు వర్తించవని తెలిపారు. డిసెంబర్ 17 నుంచి జనవరి 26 వరకూ ఆడదాం ఆంధ్రా కార్యక్రమం జరుగుతుందన్నారు. నవంబర్ 27 నుంచి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో పాల్గొనాలనుకునే వారు తమ వివరాలు సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ నెల 26న రాజ్యాంగం ఏర్పడిన దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం వికసిత భారత్ కార్యక్రమానికి పిలుపునిచ్చినందున ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రియాంబుల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు, ఎంఈఓలు ఐ.ఆంజనేయులు, ఈమని కృష్ణారెడ్డి, ఆడదాం ఆంధ్రా నోడల్ అధికారి, పీడీ రాంప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ జాకీర్ హుస్సేన్, తహసీల్దార్ మల్లేశ్వరరావు

శావల్యాపురం: 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కుల గణన సర్వేను వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎం.వెంకటరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, గ్రామసచివాలయ ఉద్యోగులకు కుల గణన, మండలంలో ఎనిమిది రోజుల పాటు కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారరథం తదితర వాటిపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య, ఈఓపీఆర్‌డీ పి.సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పెదకూరపాడుకు చెందిన బత్తుల నాగమల్లేశ్వరరావు, అశ్విని దంపతులు రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో బుధవారం ఈఓ సుధాకరరెడ్డిని కలిసి చెక్‌ను అందించారు.

ఎంపీపీ స్కూలు తనిఖీ

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో ఎంపీపీ పాఠశాలను ఎంఈఓ పుసులూరి లలిత కుమారి బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశామన్నారు. హెచ్‌ఎం యాకోబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషి

- జిల్లా వైద్యాధికారి బి.రవి
- కావూరు పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

చిలకలూరిపేట: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పల్నాడు జిల్లా వైద్యాధికారి బి.రవి చెప్పారు. చిలకలూరిపేట మండలం కావూరు పీహెచ్‌సీను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆస్పత్రి రికార్డులను తనిఖీ చేశారు. వ్యాక్సిన్లు, మందులు, ఓపీలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని, సిబ్బంది సమయపాలన, సీహెచ్‌సీ పరిధిలో అవసరమైన మందులు, టీకాల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాతాశిశు సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. అలాగే పేదలందరికీ కార్పొరేట్‌స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందేలా పలు వైద్య పథకాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యసేవల్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్య సాధనకు భాగస్వామ్యం కావాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యాధికారి బి.రాజేష్, సీహెచ్‌ఓ హర్షవర్ధనరావు, హెల్త్ సూపర్‌వైజర్లు తోట శ్రీనివాసరావు, కె.శివశంకరరావు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.


పీహెచ్‌సీలో ఇమ్యూనైజేషన్ రికార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ బి.రవి

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా బ్రహ్మానందం

చిలకలూరిపేట: బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా పొత్తూరి బ్రహ్మానందం నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు అలోకం సుధాకర బాబు నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఆయన నియామకంపై పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి జయరామిరెడ్డి అభినందనలు తెలిపారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

ఈపూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయకంగా పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ ఈదర రాధిక అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ అన్నిశాఖల అధికారుల పనితీరుపై సమీక్షించారు. ఏ అధికారైనా తమ శాఖలోని అన్ని ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందిస్తుందని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విద్యాశాఖకు వేల కోట్లు ఖర్చు పెడుతున్నప్పటికీ కొందరు ఉపాధ్యాయుల పనితీరు వల్ల విద్యార్థులకు సరిగా పాఠశాలలకు రావడం లేదని, దానిని సరిచేయాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందన్నారు. అనంతరం నూతన ఎంపీడీఓ భవనాన్ని నిర్మించేందుకు విశేష కృషి చేసిన ఎంపీపీ ఈదర రాధికను ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ గోలి భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ రంగనాయకులు, తహసీల్దార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీపీని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' ర్యాలీ

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో క్రీడాకారులు పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ కోరారు. కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు బుధవారం పురపాలకసంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పురపాలకసంఘ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ జెండా ఊపి ప్రారంభించి తాను కూడా ర్యాలీలో కొనసాగారు. ర్యాలీ స్టేషన్‌రోడ్డుగుండా మొదటి రైల్వేగేటు సమీపంలోని మున్సిపల్ అతిథి గృహం వరకు కొనసాగింది. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడలు డిసెంబరు 15 నుంచి జనవరి 26 వరకు కొనసాగుతాయన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనదల్చిన వారు ఆన్‌లైన్‌లో తమ పేర్లను సచివాలయం ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. మండలం, మున్సిపల్, నియోజకవర్గం, జిల్లా స్థాయిల్లో క్రీడలు ఉంటాయన్నారు. దీనిలో విజేతలైన వారికి రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తారన్నారు. టీపీఓ మోహనరావు, మెప్మా సీఈఓ ఉమర్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వైఎస్సార్ పాస్టర్స్ కాలనీ ఏర్పాటుపై హర్షం

వినుకొండ(నూజెండ్ల): ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ నూజెండ్ల మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పలపాడు పరిధిలో స్థలాలు మంజూరు చేసి వైఎస్సార్ పాస్టర్స్ కాలనీ ఏర్పాటు చేయడంపై నియోజకవర్గంలోని పాస్టర్లు హర్షం వ్యక్తం చేశారు. స్థలాలను మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నాగిరెడ్డిని ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలోని పాస్టర్లు పాల్గొన్నారు.


నక్కా నాగిరెడ్డిని సన్మానిస్తున్న పాస్టర్లు

అయ్యప్పస్వామి నగరోత్సవం

చిలకలూరిపేట: మండలంలోని చినపసుమర్రులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయ మండల మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో నగరోత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు క్లస్టర్-1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్-2 విడదల కమలేంద్ర, 15వ ఆర్థిక సంఘం సభ్యుడు వడితే కోట్యానాయక్ పాల్గొన్నారు.



ర్యాగింగ్ దుష్ట సంస్కృతికి నిదర్శనం

నరసరావుపేట రూరల్: ర్యాగింగ్ లాంటి అనైతిక చర్యలకు పాల్పడటం ద్వారా బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని దిశ ఎస్‌ఐ వి.గౌతమి తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్, దిశ చట్టంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్‌ఐ గౌతమి మాట్లాడుతూ కళాశాలల్లో జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయడం దుష్టసంస్కృతి అని తెలిపారు. ర్యాగింగ్ విదేశీ సాంప్రదాయమని, ఒకర్ని ఒకరు వేధించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టాన్ని తీసుకువచ్చినట్టు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసకుమార్, మహిళా సాధికారత సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పొన్నాల లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులను పరిశీలించిన జేసీ

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న రికార్డు పనులను పరిశీలించిన అనంతరం రెవెన్యూ అధికారులతో ఆయన మాట్లాడుతూ రీసర్వే పనులు వేగవంతం చేయాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం శివాపురం అగ్రహారం భూములను పరిశీలించారు. గ్రామంలోని రైతులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో సర్వే పనులను పరిశీలించారు. అన్‌సర్వే భూములను కూడా సత్వరమే సర్వే పనులు పూర్తి చేయాలని, రైతులకు హక్కులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, సర్వేయర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


రీసర్వే పనులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్